ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు
సోమవారం 26 ఆగస్టు 2024



హత్యా నేరంలో 18 మందికి యావజ్జీవం

రాయచూరు, ఆగస్టు 25 : హత్యానేరం కేసులో 18 మంది నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జిల్లా అదనపు న్యాయాధికారి బీబీ జకాతి శనివారం సాయంత్రం తీర్పు ఇచ్చారు. 2010 సెప్టెంబర్ 6న జిల్లాలోని లింగసుగూరు తాలూకా ఐదబావి గ్రామంలోని దుర్గమ్మదేవి జాతర సందర్భంగా పాత కక్షలతో శరణప్ప గోపాలప్పగౌడ అనే వ్యక్తి తుపాకీతో హత్య చేశారు. లింగసుగూరు పోలీసులు కేసును విచారించి చార్జిషీట్ దాఖలు చేశారు. న్యాయాధికారి మొదటి నిందితుడు లక్ష్మణబసప్ప గూడదల సహా మొత్తం 18 మందికి యావజ్జీ కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.5,500 జరిమాన విధించారు.





పాలికెలలకు నిధుల కోత

● సొంత వనరులతో లోటును భర్తీ చేసుకోవాలని సూచన
● వేతనాలపై తీవ్ర ప్రభావం ● గ్యారెంటీలకు మళ్లింపు వల్లేనా..?

బెంగళూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఐదు గ్యారెంటీల అమలు ద్వారా రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పించామని పాలకులు నిత్యం వల్లిస్తున్నా. ప్రతి విభాగంలోనూ గ్రాంట్లలో కోత పెడుతున్నారనే ఆరోణలు వస్తున్నాయి. బడ్జెట్‌లో కేటాయింపులకు అనుగుణంగా గ్రాంట్లు విడుదల కావడం లేదని, నిధులు గ్యారెంటీలకు మళ్లుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. దేశంలోనే సబ్ ప్లాన్ విధానం అమలు చేస్తున్న రెండో రాష్ట్రంగా పేరున్నా ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన గ్రాంట్లలోనూ కోతలు పెట్టారని ప్రతిపక్షాలు నిరసనలు చేపట్టిన విషయం తెలిసిందే. గ్యారెంటీలు పొందే లబ్ధిదారుల్లో ఎస్సీ, ఎస్టీలు ఉన్నారని, వారికే సదరు గ్రాంట్లలో కేటాయించినట్లు స్వయంగా సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప ప్రకటించడం గమనార్హం. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన గ్రాంట్లలోనే కోత ఉంటే ఇక ఇతరశాఖల పరిస్థితి ఏ విధంగా ఉంటుందనేది చర్చనీయాంశమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా మహానగర పాలికెలకు కేటాయించిన గ్రాంట్లలో 15శాతం కోత విధించడంతో ఉద్యోగుల జీతభత్యాలపై ప్రభావం చూపుతోంది. ఆదాయం తగ్గడం, సిబ్బంది కొరత, ఆర్థిక సమస్యలతో తల్లడిల్లుతున్న మహానగర పాలికెలకు ప్రభుత్వం తాజాగా జీతభత్యాల కేటాయింపులలోనూ 15శాతం కోత పెట్టడంతో ఉద్యోగులు ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. బృహత్ బెంగళూరు మహానగర పాలికెతోపాటు బెళగావి, హుబ్బళ్లి, ధారవాడ, మైసూరు, శివమొగ్గ, దావణగెరె, తుమకూరు, బళ్లారి, కలబురగి, విజయపుర పాలికెలకు సంబంధించి వేతన గ్రాంట్లలో కోత పెట్టారు. 2024-25 బడ్జెట్ కేటాయింపులలో రూ. 500 కోట్లు తగ్గించడంతో పాలికెలలో పనిచేస్తున్న ఉద్యోగుల జీతభత్యాలు, కాంట్రాక్టు సిబ్బంది వేతనాలు, ఇతరత్రా విభాగాలకు ఇబ్బందికరంగా మారింది. మహానగర పాలికెలలో జీతభత్యాలకు సంబంధించి వ్యత్యాసాలను సొంత వనరుల ద్వారా భర్తీ చేసుకోవాలని పాలనా వ్యవహారాల డైరెక్టరేట్ ఆర్థిక విభాగం జేడీ సూచించారు.

పాలికెలు	ప్రతిపాదనలు (రూ.కోట్లలో)	కేటాయింపులు	వ్యత్యాసం
మైసూరు	837	711	125
హుబ్బళ్లి-ధారవాడ	710	604	106
బెళగావి	311	264	46
మంగళూరు	374	318	56
శివమొగ్గ	273	246	27
బళ్లారి	252	227	25
దావణగెరె	398	358	40
తుమకూరు	264	237	26
కలబురగి	258	232	25
విజయపుర	182	164	18

తద్వారా పాలికెలలో తమ పన్నుల ఆదాయంలో ఏటా రూ.40-50 కోట్ల వరకు అనుసంధానం చేసుకునే సంక్లిష్ట పరిస్థితి ఏర్పడింది. పాలికెలలో సుదీర్ఘకాలంగా నియామకాలు జరగలేదు. సాంకేతికతకు అనుగుణంగా ప్రతి కార్పొరేషన్‌లోనూ కాంట్రాక్టు పద్ధతిన పనిచేసేవారు ఉన్నారు. వీరికి నెలవారీ వేతనాలు చెల్లించడం కూడా కష్టంగా మారింది. మహానగర పాలికెలలో వందల కోట్ల రూపాయల విలువైన ఆస్తులు ఉన్నా ఆశించినంత మేర పన్నులు వసూలు కావడం లేదు. ఏటా రూ.1200 నుంచి 1800 కోట్ల దాకా పన్నుల బకాయి పడుతున్నాయి. పైగా బెళగావి, కలబురగి, హుబ్బళ్ళి-ధారవాడ, మైసూరు, బళ్లారి, విజయపుర పాలికెలలో ఆదాయం కంటే ఖర్చులు ఎక్కువగా ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా గ్రాంట్లు, 15వ ఆర్థిక కమిషన్ రూపంలో విడుదల చేసిన గ్రాంట్లు సరిపోవడం లేదు. పన్నుల ఆదాయం, వేతనాలు, కార్యాలయ ఖర్చులకు పొంతన లేకుండా పోతోంది. ఈ పరిణామంతో వార్డులలో ఖర్చు చేసేందుకు సాధ్యం కావడం లేదు. పాలికె పరిధిలో ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా పాలికె ఆదాయంలోనే నియోజకవర్గాల అభివృద్ధి పనులకు ఆదేశిస్తారు. ఇలా ప్రభుత్వం నుంచి గ్రాంట్లలో కోత పడడం, మరోవైపు ఆశించినంత పాలికెల నుంచి ఆదాయం రాకపోవడంతో ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడతున్నాయి. బెళగావి పాలికెకు రూ.311 కోట్ల వేతన గ్రాంట్లకోసం ప్రతిపాదనలు పంపారు. అందులో రూ.264 కోట్లు మాత్రమే విడుదల చేశారు. మిగిలిన రూ.46 కోట్ల వ్యత్యాసాన్ని పన్నుల ఆదాయంలో సరిచేసుకోవాలని సూచించినట్టు అక్కడి కార్పొరేటర్ హనుమంత కొంగాలి తెలిపారు. గ్రాంట్లలో కోతతో ఆర్థిక సంక్లిష్ట పరిస్థితి ఏర్పడిందని, వేతనాల గ్రాంట్లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరినా ప్ర యో జనం లేకుండా పోయిందంటున్నారు.

జైలులో దర్శన్ ఫొటో వైరల్..?



వైరల్ అయిన ఫొటో ఇదే...

బెంగళూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో రెండున్నర నెలలుగా జైల్లో గడుపుతున్న నటుడు దర్శన్ ఫొటో ఒకటి వైరల్ అవుతోంది. ఆదివారం సదరు ఫొటో సోషల్‌మీడియాలో హల్‌చల్ చేసింది. పరప్పన అగ్రహార జైలులో తీసిన ఫొటోగా ప్రచారం సాగుతోంది. విల్సన్‌గార్డెన్ నాగ, రేణుకాస్వామి హత్యకేసులో 11వ నిందితుడు నాగరాజుతో పాటు మరొక వ్యక్తి ఉన్నాడు. దర్శన్ కాఫీ కప్పుతో పాటు చేతిలో సిగరెట్ ఉంది. సదరు ఫొటో పరప్పన జైలునుంచే విడుదలైందని సమాచారం. దీనిపై జైలు అధికారులు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. గతంలో అక్రమాస్తుల కేసులో అరెస్టు అయిన తమిళనాడు శశికళకు సకల సౌలభ్యాలు కల్పించారనే విమర్శలు అక్కడి జైలు అధికారులపై ఉన్నాయి. జైలు నిబంధనల ప్రకారం సిగరెట్, మాదకద్రవ్యాలకు అవకాశం ఉండదు. నటుడు దర్శన్ దర్జాగా కూర్చుని కాఫీ, సిగరెట్ తాగే ఫొటో వైరల్ అవుతున్న తరుణంలో పలు అంశాలు చర్చకు వస్తున్నాయి. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఫొటో వేలు అనే ఖైదీ తీసి భార్యకు పంపడంతో వైరల్ అయినట్టు తెలుస్తోంది. మరిన్ని వాస్తవాలు తెలియాల్సి ఉంది.

ఢిల్లీ వేదికగా పోరు

● గవర్నర్ తీరుపై కాంగ్రెస్ ● అధికార పార్టీపై బీజేపీ ● ఆందోళనలకు సన్నద్ధం

బెంగళూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో సంచలనాలకు కేంద్రాలుగా మారిన ఇటీవలి పరిస్థితులను దేశ రాజధాని ఢిల్లీ వేదికగా సత్తా చాటేందుకు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ సిద్ధమవుతున్నాయి. 'ముడా' అవినీతిలో ముఖ్యమంత్రి సిద్దరామయ్యను ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇవ్వడం, ఆ వెంటనే కోర్టులో కేసులతో రాజకీయ రచ్చ రాజుకుంది. గవర్నర్ తీరును ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టింది. వివిధ సంఘాలు, స్వామిజీలు సిద్దరామయ్యకు మద్దతు ఇస్తూ ఆందోళనలు కొనసాగిస్తున్నారు. రాజ్‌భవన్ రాజ్యాంగ నిబంధనలు ఉల్లంఘించిందని, అది బీజేపీ కార్యాలయంగా మారిందని విమర్శలు చేశారు. అందుకు ధీటుగానే ప్రతిపక్ష బీజేపీ ఆందోళన చేసింది. గవర్నర్‌కు అవమానం జరిగిందని విధానసౌధలో గాంధీ విగ్రహం వద్ద నిరసన కొనసాగించారు. వివిధ ప్రాంతాల్లోనూ ఆందోళన చేశారు. ఇలా సాగుతుండగానే రాష్ట్రానికి సంబంధించిన అంశాన్ని ఢిల్లీ వేదిక ద్వారా ప్రచారం చేయాలని రెండు పార్టీలు భావించాయి. అధికార కాంగ్రెస్ పార్టీ గవర్నర్ నిర్ణయంపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేయాలని భావిస్తోంది. ఇదే విషయాన్ని సీఎం సిద్దరామయ్య సూత్రప్రాయంగా తెలిపారు. గవర్నర్ నిర్ణయం సమంజసంగా లేదని, ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుకు ఏకంగా ముఖ్యమంత్రిని విచారణ జరపాలని నిర్ణయం తీసుకున్నారని, ఇప్పటికే ఆ వివాదంపై మాజీ న్యాయమూర్తి ద్వారా జ్యుడీషియల్ విచారణకు ఆదేశించామని పేర్కొన్నారు. సదరు విచారణలు సాగుతుండగానే గవర్నర్ ఏకంగా ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇవ్వడాన్ని తప్పుబడుతూ రాష్ట్రపతికి విన్నవించే ఆలోచనలో ఉన్నారు. ఇక ప్రతిపక్ష బీజేపీ ఇటీవల నిరసనలు, ఆందోళనల పేరిట రాజ్యాంగబద్ధమైన గవర్నర్ పదవికి అవమానం చేశారని ఆరోపిస్తూ ఢిల్లీలోని కాంగ్రెస్ కార్యాలయం ముందు ఆందోళనకు సిద్ధమవుతోంది. కర్ణాటక సమస్యను ఢిల్లీ వేదిక ద్వారా ఇరు పార్టీలు ప్రచార పోరుకు సిద్ధమయ్యాయి.

ఢిల్లీలోనే హోంమంత్రి పరమేశ్వర్



బెంగళూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): 'ముడా' వివాదంతో తలెత్తిన రాజకీయం మలుపులకు అధిష్ఠానం ముగింపు పలికింది. కానీ, పలువురు నేతలు ఢిల్లీలోనే మకాం వేయడం చర్చనీయాంశమవుతోంది. ముడా వివాదం తలెత్తిన తర్వాత ఢిల్లీ వెళ్లి అధిష్ఠానానికి వివరిస్తానని సీఎం సిద్దరామయ్య ప్రకటించారు. అందుకు అనుగుణంగా శుక్రవారం సీఎం, డీసీఎం ఢిల్లీ వెళ్లారు. తొలుత వీరిద్దరు మాత్రమే వెళ్లాలని భావించినా దాదాపు మంత్రులు, ముఖ్యనేతలంతా చలో ఢిల్లీ అంటూ వెళ్లారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, రణదీప్‌సింగ్ సుర్జేవాలాను సీఎం, డీసీఎం మాత్రమే కలిశారు. ముడా వివాదం కుట్రతో సాగిందని, ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ఎలాంటి ఆటంకం కలిగించమని కేసీ వేణుగోపాల్ భరోసా ఇచ్చారు. ఢిల్లీలో ఏదో జరుగుతుందని పెద్ద ఎత్తున తరలినవారంతా నిట్టూర్చారు. రెండు రోజులుగా హోంశాఖ మంత్రి పరమేశ్వర్ ఢిల్లీలోనే ఉన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ప్రత్యేకంగా భేటీ అయినట్టు తెలిసింది. ఆదివారం ఇదే విషయమై పరమేశ్వర్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఇక్కడికి వచ్చినప్పుడు అగ్రనేతలతో భేటీ కావడం సహజమని, ఇందులో ప్రత్యేకత ఏదీ లేదని దాటవేశారు. డీకే శివకుమార్ ఢిల్లీ పర్యటన ముగించుకుని వైష్ణోదేవి ఆలయాన్ని సందర్శించారు.





ప్రెస్‌క్లబ్‌లో చిన్నికృష్ణుల వేషధారణ



విద్యుత్ దీప కాంతుల్లో బెంగళూరు ఇస్కాన్ ఆలయం



ఇస్కాన్‌లో రాధాకృష్ణులు

కృష్ణాష్టమి సందడి

● ప్రారంభమైన వేడుకలు
● ఆలయాలకు ప్రత్యేక అలంకరణ
● ఇస్కాన్ పూజల్లో వేలాదిమంది భక్తులు



ఇస్కాన్‌లో భక్తుల సందడి



ప్రెస్‌క్లబ్‌లో...




జయనగర్ నంజనగూడు మఠంలో కళాబృందం

బెంగళూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతటా ఆదివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ప్రారంభమయ్యాయి. నగరంలోని రాజాజినగర్ ఇస్కాన్ మందిరంలో జరిగిన సంబరాలకు వివిధ ప్రాంతాలకు చెందిన వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. జయనగర్‌లోని నంజనగూడు రాఘవేంద్ర స్వామి మఠంలో 353 ఆరాధన సప్త రాత్రోత్సవ వేడుకలు జరిగాయి. డ్యాన్స్ దిశ ట్రస్టుకు చెందిన 60మంది విద్యార్థినులు భరతనాట్యం చేశారు. ప్రెస్‌క్లబ్‌లో వందే కర్ణాటక మాసపత్రిక వ్యవస్థాపకుడు లింగయ్య కాడదేవరమఠ వేడుకలను ప్రారంభించారు. నలపాక హోటల్ నిర్వాహకురాలు కవితా లింగయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు. పాత్రికేయుల పిల్లలు రాధాకృష్ణ ర్యాంప్‌వాక్, భరతనాట్యంతో పాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి శివకుమార్ బెళ్లితట్టె, సాంస్కృతిక సమితి సహ సంచాలకులు రోహిణి వి అడిగ, ప్రభుత్వ మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రోషిణిగౌడ, గోకుల్ గ్రూప్ మంజునాథ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ఏస్ ఎన్‌లైట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



ఏస్ ఎన్‌లైట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇలా..



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1627.87	1,626.38
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	23,725	1,636
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,023	10,211
సామర్థ్యం (టీఎంసీలు)	86.27	81.10

ప్రశాంతంగా వీరశైవ మహాసభ ఎన్నికలు



విజయనగరలో ఓటు వేసి బయటకు వస్తున్న వీరశైవులు

బళ్లారి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): అఖిల భారత వీరశైవ లింగాయత మహాసభ 27వ కార్యకారిణి సమితి ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలో బళ్లారి, సిరుగుప్ప నగరంలో మాత్రం పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బళ్లారి నగరంలో కిత్తూరు రాణి చెన్నమ్మ హైస్కూల్లో ఓటింగ్ జరిపారు. మొత్తం 5 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బళ్లారి నగరంలో 1503 మంది, కురుగోడులో 151 మంది, కంప్లిలో 136 మంది, సండూరులో 225 మంది ఓటర్లు ఉండగా, ఎన్నికల అధికారిగా డా.వి. ఎస్ ప్రభయ్య వ్యవహరించారు. ఎన్నికల సిబ్బందిగా 25 మంది వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో అంగడి శంక్రప్ప, కరేగౌడ, నందీష్ మఠ, గోనాల్ రాజశేఖర్ పోటీలో ఉన్నారు. మొత్తం మీద ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది.

ఆకట్టుకున్న ఫ్యాషన్ షో



ఫ్యాషన్ షోను ప్రారంభిస్తున్న దృశ్యం

బళ్లారి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): శ్రీమాతృ మహిళామండలి ఆధ్వర్యంలో బళ్లారిలోని రంగ మందిరలో జరిగిన ఫ్యాషన్‌షో విశేషంగా ఆకట్టుకుంది. దక్షిణ భారత సాంప్రదాయ దుస్తులతో వనితలు పాల్గొన్న ఈ షో అందరిని అబ్బుర పరిచింది. ముఖ్య అతిథిగా జోళద రాశి తిమ్మప్ప పాల్గొని జ్యోతిని వెలిగించారు. జౌళి హస్తకళ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అజిత్ నాయక్ తదితరులు పాల్గొని మాట్లాడారు. మహిళలు ఇంట్లోనే వంటమనిషిలా కాకుండా వారికి ఇష్టమైన కళలు, ప్రదర్శనలు చేసి ఆనందం పొందాలని కోరారు. మహిళలు ఎప్పుడూ ఇంటి పాటునే కాకుండా సమాజంలో జరుగుతున్న వాటిని తెలుసుకుని వారు కూడా అన్ని రంగాల్లో ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో సుమారు 30 మంది మహిళలు పాల్గొన్నారు. అనంతరం షోలో పాల్గొన్న వనితలకు బహుమతులను ప్రదానం చేశారు. వీరితోపాటు జ్యోతి మమత, సునీత, రూప, శృతి రేణు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

కంప్లి, సిరుగుప్ప మధ్య బస్సుల బంద్

ఇబ్బందుల్లో ప్రయాణికులు



సన్నాపురం వద్ద రోడ్డుపై ఏర్పడిన గండి

కంప్లి, ఆగస్టు 25 : సన్నాపురం వద్ద రోడ్డు తెగిపోవడంతో కంప్లి సిరుగుప్ప మధ్య బస్సు రాకపోకలు బందయ్యాయి. నాలుగు రోజులక్రితం కురిసిన భారీ వర్షాలకు నారాయణస్వామి, బసవేశ్వర క్యాంపు పైభాగాల నుంచి సన్నాపురం వైపుకు నీరు పోటెత్తడంతో రోడ్డునే ధ్వంసం చేసి నీరు వెళ్లేలా చేశారు. అప్పటినుంచి ఆ రోడ్డులో బస్సులు ఆగిపోయాయి. ఇంతవరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇటిగి, మన్నూరుసూగూరు, రుద్రపాద, నిడునెట్టూరు మీదుగా సిరుగుప్ప వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.. కేవలం ద్విచక్రవాహనద్వారానే గమ్యానికి చేరుకునే పరిస్థితి ఏర్పడింది. త్వరలో అధికారులు రోడ్డు పనులను పూర్తి చేసి సిరుగుప్ప, కంప్లి మధ్య బస్సుప్రయాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇదెక్కడి న్యాయం?

- జిందాల్‌కు 3,677 ఎకరాల విక్రయానికి సర్కారు సిద్ధం
- భూమిని విక్రయించరాదంటున్న రైతులు



భూముల విక్రయానికి వ్యతిరేకంగా ఉద్యమించిన కమ్యూనిస్టులు

బళ్లారి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా సండూరు తాలూకా తోరనగల్లు, కురేకుప్ప, గ్రామాల పరిధిలో వచ్చే 3,677 ఎకరాల ప్రభుత్వ భూమిని జిందాల్ కంపెనీకి విక్రయించేందుకు కర్ణాటక ప్రభుత్వం సిద్ధమైంది. రైతుల నుండి పారిశ్రామిక అభివృద్ధి పేరుతో గతంలో తక్కువ ధరకే భూమికి కొనుగోళ్లు చేసిన ప్రభుత్వం ఇప్పుడు ఆదే భూమిని జిందాల్ కంపెనీకి విక్రయించడానికి సిద్ధమైందని తెలిసింది. రెండు రోజుల క్రితం సిద్దరామయ్య ఆధ్వర్యంలో క్యాబినెట్ సమావేశం జిందాల్‌కు భూమిని అమ్మేందుకు ఓకే చెప్పింది.

ఇంతకు ముందు ప్రభుత్వ అనుబంధ సంస్థ అయిన కర్ణాటక ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ బోర్డు(కేఐఏడీబీ) రైతుల నుంచి ఎకరా రూ.10,950 రూపాయల వంతున భూమిని కొనుగోలు చేసింది. అప్పట్లో ఈ ప్రాంతంలో పరిశ్రమల స్థాపన, ఉద్యోగ అవకాశాల పెంపు, పర్యావరణ సంరక్షణ కోసం కొనుగోలు చేసినట్టు కేఐఏడీబీ వెల్లడించింది. రైతుల నుండి కొనుగోలు చేసిన భూమిని ప్రభుత్వం జిందాల్ స్టీల్ కంపెనీకి లీజ్‌కు ఇచ్చింది. ఇదే భూమిని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం జిందాల్‌కు శాశ్వతంగా ధారాదత్తం చేసేందుకు తలూపింది.

2019 మే 27లో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 3667 ఎకరాల భూమిని జిందాల్ కంపెనీకి ఒకరాకు, రూ.1.22లక్షలకు విక్రయించేందుకు ఒప్పందం కుదిరింది. 2019 మే 28న, యడ్యూరప్ప దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. కుమారస్వామి జిందాల్ నుంచి మామూళ్లు తీసుకుని భూమిని తక్కువ ధరకే ఇచ్చేందుకు అమోదం తెలిపారని ఆరోపణలు చేశారు. అలాగే ఇతర మంత్రులు కూడా తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు.

2021లో బిఎస్ యడ్యూరప్ప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ కంపెనీకి భూమిని విక్రయించేందుకు తిరిగి సిద్ధమయ్యారు. అయితే అప్పట్లో యడ్యూరప్పప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రస్తుత సిద్దరామయ్య నేతృత్వంలో కాంగ్రెస్ పెద్ద ఎత్తున పోరాటం చేసింది. అప్పట్లో బీజేపీ క్యాబినెట్‌లో ఉండే అరవింద్ బెల్లాడ్, ఇతర బీజేపీ ఎమ్మెల్యేలు కూడా ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. దీంతో అప్పుడు బీజేపీ తాను తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. ఈనేపథ్యంలో ప్రస్తుత సిద్దరామయ్య క్యాబినెట్ జిందాల్‌కు ఆ భూమిని సేల్ చేయడానికి ఎందుకు సమ్మతించిందో తేలాల్సి వుంది.

రైతుల నుంచి తీసుకున్న భూములను జిందాల్‌కు విక్రయించొద్దు

ఇంతకు ముందు రైతుల నుంచి కేఐడీపీ ద్వారా భూములు కొనుగోలు చేసిన ప్రభుత్వం జిందాల్ కంపెనీకి ఆ భూమిని లీజ్‌కు కాకుండా విక్రయం చేయడం అన్యాయమని భూములు అమ్మిన రైతులతో పాటు రైతు సంఘాల నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇందుకు వ్యతిరేకంగా ఆదివారం విజయనగరం జిల్లాలో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నాలు చేశారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బడి భవనం భద్రం.. దారి అధ్వాన్నం

- మౌలానా ఆజాద్ స్కూల్‌కు వెళ్లాలంటే సర్కస్ చేయాల్సిందే..

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 25: కౌల్ బజార్ 32 వార్డు పరిధిలోకి వచ్చే మౌలానా అజాద్ పాఠశాకు వెళ్లాలంటే విద్యర్థులు, విద్యార్థులను తీసుకెళ్ళే వాహనాలు సర్కస్ చేస్తూ వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. వెళ్ళే సమయంలో



అధ్వాన్న స్థితిలో ఆజాద్ పాఠశాల రోడ్డు...

సమయంలో ఏమాత్రం పట్టుజారినా... ఏకంగా బురదగుంటలో పడాల్సిన పరిస్థితి నెలకొంది. బళ్ళారి నగరంలోని 32వ డివిజన్‌లో ఈ పాఠశాల ఉంది. కళ్యాణ కర్ణాటక పరిధిలోకి వచ్చే బళ్ళారి జిల్లాలో విద్యాభివృద్ధికి ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా పాఠశాలలు, రోడ్ల అభివృద్ధికి నోచుకోక పోవడం విశేషం. ప్రజా పనుల శాఖ, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పాఠశాలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలన్న ప్రభుత్వ ఉద్దేశం నీరుగారి పోతోంది. పరిస్థితులు ఇంత దారుణంగా ఉన్నా జిల్లా విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ ఏమైందనే విషయం అర్థం కావడం లేదు. కౌల్‌బజార్ ప్రాంతంలో ఎక్కువగా మురికివాడలు ఉండగా,ముస్లిం సమాజానికి చెందిన ప్రజలే ఎక్కువగా నివసిస్తుంటారు. అలాంటి వారి పిల్లల విద్యాభ్యాసానికి ప్రభుత్వ ఏర్పాటు చేసిన ఇలాంటి విద్యాసంస్థల్లో సమస్యలు నెలకొనడంతో పేద ప్రజలు కూడా ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపాల్సివస్తోంది. ఏది ఏమైనా జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ పాఠశాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించడానికి కృషి చేయాలని విద్యార్థుల తల్లితండ్రులు అధికారులను కోరుతున్నారు.

గంగామత సమాజాన్ని ఆదుకుంటాం

- మత్స్యశాఖ మంత్రి మాంకాళ్ వెల్లడి

కంప్లి, ఆగస్టు 25: రాష్ట్రంలో వుండే గంగామత సమాజాన్ని ఆదుకుని ప్రభుత్వ సదుపాయాలు అందిస్తామని మత్స్యశాఖ మంత్రి మాంకాళ్ ఎస్ వైద్య తెలిపారు. గంగామతస్థుల సమాజం వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. స్థానిక ఎమ్మెల్యే జేఎన్ గణేష్ క్షేత్రస్థాయిలో కష్టాలను గుర్తుంచుకుని పెద్దలతో చర్చించి సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. అలాగే సముదాయ భవనానికి కూడా రూ. కోటి మంజూరు చేస్తామన్నారు. త్వరలోనే కంప్లిలో గంగా మతస్థులకు సముదాయ భవనం కూడా ఏర్పడుతుందని, అలాగే సమాజాన్ని ఎస్టీలో చేర్చాలని ముఖ్యమంత్రికు, కేంద్రానికి లేఖలు రాశామని తెలిపారు. తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ గంగామత సమాజానికి అండగా వుంటుందన్నారు. వృత్తిపరంగా వచ్చే పనులకు పిల్లలను పంపకుండా పాఠశాలల్లో చేర్చి విద్యావంతులను చేయాలన్నారు. మరోసారి ఈ ప్రాంతానికి వచ్చి అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ముందడుగు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాజం పదాధికారులు ఆయనను అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నాగరాజు, సిద్దప్ప, మనోహర్, సురేష్, రాఘవేంద్ర, అయోధ్య వెంకటేష్, తదితర సమాజం పదాధికారులు పాల్గొన్నారు.



కంప్లిలో మత్స్యశాఖ మంత్రిని సన్మానిస్తున్న దృశ్యం

లాఠీ వదిలి పారపట్టిన కానిస్టేబుల్

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 25: నగరంలోని రాయల్ సర్కిల్‌లో క్లాక్‌టవర్ నిర్మాణమవుతున్న నేపథ్యంలో రాయల్ సర్కిల్ నుండి సంగం సర్కిల్ వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. రాయల్ సర్కిల్‌ను కలిపే ప్రతి రోడ్డులోనూ ఉదయం నుండి రాత్రి వరకు వాహనాల రద్దీ పెరిగిపోయింది. దీంతో ప్రధానరోడ్లు అన్నీ గుంతలమయమయ్యాయి. రోడ్ల నిర్వహణ బాధ్యతలు చేపట్టాల్సిన కార్పొరేషన్, ప్రజా పనుల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కెసి రోడ్డు-మీనాక్షి సర్కిల్ మీదుగా వెళ్ళే రోడ్డులో మోకాటి లోతు గుంత ఏర్పడడంతో ప్రజల ఇబ్బందులను తెలుసుకున్న ఓ ట్రాఫిక్ పోలీసు పారను చేతబట్టి ట్రాక్టర్‌లో మట్టిని కిందకులాగి రోడ్డులో ఏర్పడిన గుంతను పూడ్చే ప్రయత్నం చేశారు. ఈ దృశ్యాన్ని చూసిన ప్రజలు ఫోటో తీసి సోషియల్ మీడియాలో పోస్టుచేశారు. అధికారులను దుమ్మెత్తి పోస్తూ... బళ్ళారి నగర రోడ్ల నిర్వహణ అంటే ఇదేనా? అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఇకనైనా అధికారులు మేల్కొని నగరంలో ప్రధాన సర్కిళ్ళు, రోడ్లలో ఏర్పడిన గుంతలను పూడ్చి వాహనాల రాకపోకలు జరిగేలా చూడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



మీనాక్షి సర్కిల్ వద్ద పారచేతబట్టి గుంతను పూడుస్తున్న పోలీసు

రోడ్డుకడ్డంగా హైమాస్ట్ లైట్ స్తంభం

- సంబంధం లేదంటున్న నగర కార్పొరేషన్, బుడా



గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో నేలకూలిన హైమాస్ట్ లైట్ స్తంభం

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 25: నగరంలోని కూల్ కార్నర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ విద్యుత్‌స్తంభాన్ని గుర్తుతెలియని వాహనం శుక్రవారం రాత్రి ఢీకొనడంతో అది కాస్తా కూడా రోడ్డుకు అడ్డంగా పడింది. నేలకూలి మూడు రోజులు గడిచినా ఇంతవరకు అది కూలడానికి కారణమైన వాహనాన్ని ఎవరూ కనుక్కోలేక పోయారు. కార్పొరేషన్ అధికారులు, విద్యుత్ లైటు ఏర్పాటు చేసిన బళ్ళారి అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులు తమకు ఏమాత్రం సంబంధం లేదని చేతులు దులుపుకుంటున్నారు. హైమాస్ట్ లైట్‌ను నేలకూల్చిన వాహనాన్ని తెలుసుకోవడానికి అధికారులు ఏమ్రాతం చొరవ చూపడం లేదు. నగరంలోని ప్రధాన సర్కిళ్ళలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు పనిచేస్తున్నాయా లేదా అర్థం కావడం లేదని స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు మూడురోజులుగా సామాజిక మాధ్యమాల్లో గెంతెత్తి అరుస్తున్నా... ఇప్పటి వరకు అధికారుల్లో చలనం లేదు. కూల్ కార్నర్ సర్కిల్‌లో చుట్టూ ఉన్న షాపుల్లో ఏర్పాటైన సిసి కెమెరాల డేటా సేకరించి లారీని గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు అధికారులను కోరుతున్నారు.

నగరసభ ఎన్నికలపై కాంగ్రెస్ కసరత్తు



నగరసభ ఎన్నికలపై సమావేశం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ

సిరుగుప్ప, ఆగస్టు 25: పార్టీ హైకమాండ్ ప్రకటించిన అభ్యర్థికే ఓటు వేయాలని ఎన్నికల పర్యవేక్షకులు అబ్దుల్ జబ్బర్‌సాబ్ తెలిపారు. ఆదివారం సిరుగుప్ప పట్టణం పీడీసీసీ బ్యాంకు ఆవరణంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రముఖులు నాగరాజు, ఎన్నికల పరిశీలకుల సమక్షంలో సమావేశం జరిగింది. ఈ నెల 27న జరుగనున్న సిరుగుప్ప నగరసభ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలలో పార్టీ హైకమాండ్ ప్రకటించిన అభ్యర్థికి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఓటు వేయాలని సూచించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖరయ్య, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కరిబసప్ప, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న లారీ ఓనర్ల ధర్నా



లారీ ఓనర్లతో మాట్లాడుతున్న పోలీసులు

బళ్లారిరూరల్, ఆగస్టు 25: బళ్లారి తాలుకాలో లారీ ఓనర్ల ధర్నా ఐదవ రోజు కొనసాగుతోంది. లారీ అసోసియేషన్ అధ్యక్షులు మించు శ్రీనివాస్ ఆధ్వర్యంలో లారీ ఓనర్లు కుడితిని, బెళగల్, సిడిగినమల, బెళగల్ తాండ, వేణి వీరాపురం తదితర ఫ్యాక్టరీల వద్ద ధర్నా చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ లారీ ఓనర్లకు ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు పెంచాలని కోరారు. తమ డిమాండ్లు పరిష్కారమయ్యేంత వరకు శాంతియుతంగా ధర్నా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నూర్, కార్యదర్శి మహబూబ్ బాషా, ఫయాజ్, నాగరాజు, కార్పొరేటర్లు, బీఆర్ఎల్ శీన, ప్రభంజన్‌కుమార్, లారీ ఓనర్లు, ప్రవీణ్ కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రికి వాషింగ్ మిషన్ అందజేత



ఆస్పత్రికి వాషింగ్ మిషన్ అందిస్తున్న దృశ్యం

కంప్లి, ఆగస్టు 25: కుడితిని పట్టణ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజశేఖర్ సహోదర పుత్రిక చిన్మయి జన్మదినం సందర్భంగా వాషింగ్‌మిషన్‌ను బహూకరించారు. డాక్టర్ గురుబసవరాజు దానిని స్వీకరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్, రాములు మాట్లాడుతూ జన్మదిన వేడుకల సందర్భంగా డబ్బులు వృథా చేయకుండా ఆడంబరాలు లేకుండా ఆ డబ్బును పేద ప్రజలకు పంపిణీ చేస్తే ఎంతో మేలు చేసిన వారవుతామన్నారు. ఇది ఎందరికో ఉపయోగపడుతుందన్నారు. గతంలో కుట్టుమిషన్లు, ప్రభుత్వాస్పత్రి బెడ్‌షీట్లు, పేద కుటుంబాల వారికి పుట్టిన రోజు సందర్భంగా అందించామన్నారు. ప్రతి ఒక్కరు ఇలా పుట్టిన రోజు సందర్భంగా ఆడంబరాలు లేకుండా తమ చుట్టూ వున్న పేద కుటుంబాల వారిని గుర్తించి ఆదుకోవాలన్నారు. వారితోపాటు రాము, వెంకటరమణబాబు, కనికేరి పంపాపతి, మాంతేష్, నిత్య తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

రోడ్డు ప్రమాదంలో పదిమందికి గాయాలు

పేరండపల్లి సమీపంలో ఏడు కార్లు, మూడు లారీలు, ఒక ఆర్టీసీ బస్సు ఢీ



దెబ్బతిన్న వాహనాలు

హోసూరు(క్రైం), ఆగస్టు 25: కృష్ణగిరి జాతీయ రహదారిపై హోసూరు సమీపంలోని పేరండపల్లి ఫారెస్ట్ సమీపాన 7 కార్లు, 3 ట్రక్కులు ఆర్టీసీ బస్సును ఢీ కొనడంతో పదిమంది గాయపడ్డారు. ఈ వాహనాలు ఆదివారం బెంగళూరు నుంచి కృష్ణగిరికి వెళ్తుండగా ఒకదానినొకటి ఢీకొన్నాయి. ముందుగా లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో ముందున్న వాహనాలను ఢీ కొట్టింది. ఆ వెనుక వచ్చిన వాహనాలు ఒకదానినొకటి ఢీ కొని ప్రమాదానికి గురయ్యాయి. ఈ ప్రమాదంలో కార్లు నుజ్జు నుజ్జుకాగా. చక్రాలు దొర్లుకుంటూ వచ్చేసాయి. బస్సులు, ట్రక్కులు కూడా దెబ్బతిన్నాయి. ప్రమాదంలో కారులో కోయంబత్తూరుకు చెందిన ఆయిల్ మిల్ సీఈఓ వెంకటేశ్(33) అతని స్నేహితుడు అరవింద్(30), ఉద్యోగులు తంజావూరుకు చెందిన దురై(24)పళనికి చెందిన కార్తీక్ రాజా(26 అతని కుమారుడితో పాటు నలుగురు గాయపడ్డారు. మరో కారులో ప్రయాణిస్తున్న కృష్ణగిరికి చెందిన వెల్విళి (65), కారు డ్రైవర్ రవి (55) గాయపడ్డారు. వెంటనే వారిని హోసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.. తదుపరి చికిత్స నిమిత్తం వెల్విళిని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన డ్రైవర్ రవికి తీవ్రగాయాలు కావడంతో కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. హడ్కో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నూతన భవనాల తనిఖీ

హోసూరు ఆగస్టు 25: హోసూరు కార్పొరేషన్ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న భవనాలను మున్సిపల్ కమీషనర్ శ్రీకాంత్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోసూరు నగరపాలక సంస్థ కమీషనర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో 24 వ తేదీన వార్డు నంబర్ 21లో అగ్రహారం రింగ్ రోడ్డు ప్రాంతంల్లో తనిఖీలు నిర్వహించారు. సర్వేలో ప్రతి వ్యాపారాన్ని, పరిశ్రమను తనిఖీ చేసి ఆస్తిపన్ను చెల్లించారా? కొత్త భవనాలకు ఆస్తిపన్ను కట్టారా? అని ఆరా తీశారు. అలాగే కొత్తగా షాపింగ్ మాల్స్ , నిర్మిస్తున్న భవనాలను తనిఖీ చేశారు.

లక్ష మొక్కలు నాటడమే లక్ష్యం

హోసూరు ఆగస్టు 25: హోసూరు కార్పొరేషన్ పరిధిలో లక్ష మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం మేయర్ సత్య, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, ఎమ్మెల్యే వై.ప్రకాశ్, ప్రారంభించారు. హోసూరు పరిశ్రమల సంఘం, కావేరి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. హోసూరు డీ.ఎస్.పీ.బాబు ప్రశాంత్, కావేరీ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ఆసుపత్రి డైరెక్టర్ విజయబాస్కర్, అధ్యక్షుడు సుందరయ్య, కార్యదర్శి అరులాళనందం, పార్లమెంట్ సభ్యుడు నాగరాజ్, డీఎంకే కార్యవర్గసభ్యుడు ఎల్లోరమణి పాల్గొన్నారు. హోసూరు వనకొట్టంలో మొక్కలు కొనుగోలు చేసి కార్పొరేషన్ అంతటా మొక్కలు నాటడం, సంరక్షించడం వంటి కార్యక్రమాలను చేపట్టామన్నారు.



మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ సత్య

వర్షాలు పడితే వంక దాటాల్సిందే

కంప్లి, ఆగస్టు 25 : తాలుకా పరిధిలోని నాగలాపురం గ్రామంలో స్మశానానికి వెళ్లేందుకు సరియైన రోడ్డు లేకపోవడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాగలాపురం గ్రామంలో ఆదివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. అయితే శవాన్ని స్మశానానికి తీసుకెళ్లేందుకు రోడ్డు లేకపోవడంతో పక్కనే వున్న వాగును దాటించి తీసుకెళ్లారు. ఈ విషయంపై ఎన్నోసార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని వాపోయారు. వర్షాలు కురిస్తే స్మశానానికి వెళ్లేందుకు చాలా కష్టంగా మారుతోందన్నారు. ఇప్పటికైనా అధికారులు గుర్తించి నాగలాపురం గ్రామంలో స్మశానానికి రోడ్డు ఏర్పాటు చేసి ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చూడాలని స్థానికులు కోరారు.



మృతదేహాన్ని వంకలోనుంచి స్మశానానికి తీసుకెళుతున్న దృశ్యం

రాయచూరులో ఎయిమ్స్ ఏర్పాటు చేయాలి

రాయచూరు, ఆగస్టు 25: విద్యాపరంగా అత్యంత వెనకబాటుతనానికి గురైన రాయచూరు జిల్లాకు ఎయిమ్స్ మంజూరు చేసే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ డా.బసవరాజ్ కళస అన్నారు. ఎయిమ్స్ ఏర్పాటుతోనే జిల్లాకు తగిన న్యాయం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఆసుపత్రి ఏర్పాటు కోసం అఖిలపక్షం, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక నిరాహార దీక్ష ఆదివారంతో 836వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మహాత్మ గాంధీ స్టేడియంలోని శిబిరం వద్ద పోరాట సమితి కన్వీనర్ డా.బసవరాజ్ కళస మాట్లాడుతూ, ఇప్పటికే జిల్లాకు ఐఐటీ ఇస్తామని చెప్పిన పాలకులు దాన్ని ఇతర జిల్లాకు తరలించడం జిల్లా ప్రజలను తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. రాయచూరు జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటుకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులు ఏనాడు నోరు విప్పకపోవడం బాధ్యత రాహిత్యమన్నారు. వారికున్న నిబద్ధతను వారి మౌనం తెలియజేస్తున్నదన్నారు. నాయకులకు ఎన్నికలపట్ల ఉన్న ధ్యాస అభివృద్ధిపై లేకపోవడం దౌర్భాగ్యమన్నారు. తమ పోరాటాన్ని ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకుని తగిన న్యాయం చేయాలన్నారు.



నిరవధిక దీక్ష చేస్తున్న నాయకులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కృష్ణాష్టమి




హిందూ ఇతిహాసాలలో శ్రీమహావిష్ణువు ఎనిమిదో అవతారం శ్రీకృష్ణుడి జన్మదినం. దేవకి వసుదేవులకు శ్రావణమాసం కృష్ణపక్షం అష్టమిన జన్మించారు. కృష్ణాష్టమి, జన్మాష్టమి లేదా గోకులాష్టమి, అష్టమి రోహిణి అని కూడా పిలుస్తారు. ఈ పండుగని ఉట్ల పండుగగా ఉట్ల తిరునాళ్లు అని పిలుస్తారు. పండుగ రోజున భక్తులు పగలంతా ఉపవాసం ఉండి సాయంత్రం శ్రీకృష్ణుడిని పూజిస్తారు.

మదర్ థెరీసా (జయంతి)



మానవత్వానికి ప్రతీకగా నిలిచిన మదర్ థెరీసా 1910 ఆగస్టు 26న ఉత్తర మెసిడోనియాలోని స్కోప్జే ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు ఆగ్నిస్ గోక్షా బొజాక్షు. రోమన్ కేథలిక్ సన్యాసిని. భారతదేశ పౌరసత్వం పొంది మిషనరీస్ ఆఫ్ ఛారిటీని కోల్‌కతాలో స్థాపించారు. 45 సంవత్సరాలపాటు ప్రపంచంలోని ఇతర దేశాలకు వ్యాపించేలా చారిటీ సేవలను విస్తరింప చేశారు. పేదలకు, రోగగ్రస్తులకు, అనాథలకు, మరణశయ్యపై ఉన్నవారికి పరిచర్యలు చేసి మానవతామూర్తిగా నిలిచారు. 1979లో నోబెల్ శాంతి పురస్కారాన్ని, 1980లో భారతరత్న పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమాల్లో భాగంగా మతమార్పిడులను ప్రోత్సహించారనే విమర్శలు ఎదుర్కొన్నారు. 1997 సెప్టెంబరు 5న కన్నుమూశారు. మరణానంతరం పోప్ జాన్ పాల్ 2చే దైవ ఆశీర్వాదం (బీటిఫికేషన్), బ్లెస్డ్ థెరీసా ఆఫ్ కోల్‌కతా బిరుదు పొందారు.

స్కాట్ హెండెర్సన్ (పుట్టినరోజు)



అమెరికా దేశానికి స్కాట్ హెండర్సన్ 1954 ఆగస్టు 26న జన్మించారు. జాజ్ ఫ్యూజన్, బ్లూస్ గిటారిస్ట్‌గా పేరొందారు. ప్రత్యేకించి 'ట్రైబల్ టెక్' బ్యాండ్‌తో కలసి పని చేసి పేరొందారు. 1980వ దశకంలో ఫ్యూజన్ బ్యాండ్స్‌లో ట్రైబల్ టెక్ తనదైన గుర్తింపు పొందింది. 1991లో నెంబరు జాజ్ గిటారిస్ట్‌గా గిటార్ వరల్డ్ మ్యాగజైన్‌చే గుర్తింపు పొందారు. కాలిఫోర్నియాలోని మ్యూజీషియన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ఒకటైన గిటార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో టీచింగ్ చేశారు.

జీతూ రాయ్ (పుట్టినరోజు)



షూటింగ్‌లో 'పద్మశ్రీ' అందుకున్న జీతూ రాయ్ 1987 ఆగస్టు 26న నేపాల్‌లో జన్మించారు. పది మీటర్ల ఎయిర్ పిస్టల్, 50 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లలో రాణించి 2014 ఏసియన్ గేమ్స్‌లో దేశానికి తొలి స్వర్ణపతకం సాధించి చరిత్ర సృష్టించారు. 2018 కామన్వెల్త్ గేమ్స్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో సత్తా చాటుకున్నారు. 2016లో ఖేల్‌రత్న అవార్డు అందుకున్నారు. 2020లో పద్మశ్రీ పురస్కారం పొందారు. కాగా ఆర్మీలో సుబేదార్ మేజర్ హోదాలో ఉన్నారు.

ఆపరేషన్ కమలపై మరోసారి గుసగుసలు..!

» కాంగ్రెస్ ఎమ్మెల్యే రవి గణిగ వ్యాఖ్యలతో సంచలనం

బెంగళూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కుటిల రాజకీయాలకు తెర లేస్తోందా..? అనే చర్చలు మరోసారి జోరందుకుంటున్నాయి. ఆపరేషన్ కమలకు ప్రయత్నాలు సాగుతున్నాయని వంద కోట్ల ఆఫర్ జరిగిందని మండ్య కాంగ్రెస్ ఎమ్మెల్యే రవి గణిగ ఆరోపణలు హల్‌చల్ చేస్తున్నాయి. మండ్యలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రమంత్రులు కుమారస్వామి, శోభాకరంద్లాజె, ప్రహ్లాద్‌జోషి, బీజేపీ నేత బీఎల్ సంతోష్‌లు కుట్ర పన్ని ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు వంద కోట్ల రూపాయల ఆఫర్ చేస్తున్నారని అదే జరిగితే భారీ పరిణామాలు తప్పవన్నారు.



మీడియాతో ఎమ్మెల్యే గణిగ రవి

సిద్దరామయ్య శక్తివంతంగా ఉన్నారని, సమర్థుడైన వ్యక్తి ఆవడంతో ఎదుర్కొంటున్నారన్నారు. ఇదే విషయమై వైద్యవిద్యాశాఖ మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్ ఆపరేషన్ కమలకు సంబంధించి కాంగ్రెస్ లెజిస్లేచర్ భేటీలోనూ చర్చ జరిగిందన్నారు. బీజేపీ, జేడీఎస్ మధ్యవర్తులు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు వంద కోట్ల రూపాయలు ఆఫర్ చేసింది వాస్తవమేనన్నారు. మా ఎమ్మెల్యే బహిరంగంగానే వ్యాఖ్యానించారన్నారు. అంతగా చెప్పారంటే వాస్తవం లేకుండా ఉండదన్నారు.

వైద్యం వ్యాపారం కారాదు

» వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు



కార్యక్రమంలో ప్రముఖులు

బెంగళూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వైద్యం వ్యాపారీకరణ కారాదని సమాజంలో ఆరోగ్యం పెంచేందుకు సేవాభావం కల్గిన డాక్టర్ల సేవలు అవసరమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు ప్రకటించారు. ఆదివారం కనకపుర రోడ్డులో ధి ఆసుపత్రి ఆరంభించిన సమయంలో మాట్లాడుతూ ఆరోగ్యరంగంలో సేవాభావం ఉండాలన్నారు. జయదేవ, కిద్వాయ్ లాంటి ఆసుపత్రులకు అత్యుత్తమైన పేరు వచ్చేందుకు ఎంతోమంది సుదీర్ఘకాల శ్రమ ఉందన్నారు. ఆరోగ్యరక్షణకు ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందన్నారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ధి వంటి ప్రైవేట్ ఆసుపత్రుల పాత్ర ముఖ్యమన్నారు. జబ్బులు రాకుండా ముందస్తు చర్యలు ముఖ్యమన్నారు. రోటరీ, వ్యాసా, వంటిసేవా సంస్థలతో కలసి సమాజంలో ఆరోగ్యవంతం పెంపొందించే ప్రయత్నం చేస్తామన్నారు. డాక్టర్ చంద్రశేఖర్ మునియప్ప ఆసుపత్రి ప్రారంభించడం సంతోషకరమన్నారు. హృదయజ్యోతి పథకం సకాలంలో రోగిని కాపాడుతుందన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ గురూజీ మాట్లాడుతూ ఆరోగ్యవంత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఉత్తమ విద్య, ఆరోగ్యం దేశ ప్రగతికి సహకారనమన్నారు. మనస్సు, దేహం, జీవనశైలి పట్ల అవగాహన ఉండాలన్నారు. ఆసుపత్రి సీఈఓ డాక్టర్ చంద్రశేఖర్ చిక్క మునియప్ప మాట్లాడుతూ ఏకాభిప్రాయం కల్గిన పలువురు డాక్టర్లతో కలసి ఆసుపత్రిని ప్రారంభించామన్నారు. విద్యానిపుణుడు డాక్టర్ గురురాజ్ కరజగి, రోటరీ ఫౌండేషన్ ఏసియా రాయబారి రవిశంకర్ దకోజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

బొమ్మనహళ్ళి, ఆగస్టు 25: ప్రభుత్వ పాఠశాల, కళాశాలలకు చెందిన 250మంది విద్యార్థులకు రాజస్థాని యూత్ అసోసియేషన్ సార్వజనీక సేవా ట్రస్టు బొమ్మనహళ్ళి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు సంజయ్ షా మాట్లాడుతూ బెంగళూరు శివారు ప్రాంతాలైన బొమ్మనహళ్ళి, ఆనేకల్ తదితర గ్రామీణ ప్రాంతాలవారికి 50ఏళ్లుగా విద్య, ఆరోగ్య సేవా కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. ట్రస్టు 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పాఠశాలకు అవసరమైన ఆర్‌ఓ ప్లాంట్స్, కంప్యూటర్‌లు ఇస్తున్నామన్నారు. జయదేవ ఆసుపత్రి హృద్రోగ రోగులకు తమవంతుగా రూ.30వేలు చేయూత ఇస్తున్నామన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో అవసరమైన వారికి నోటు పుస్తకాలతోపాటు కొన్నిచోట్ల పాఠ్యపుస్తకాలు సమకూర్చామన్నారు. విద్యార్థులకు తగిన అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. పాఠశాలలకు అవసరమైన బల్లలు, బెంచీలు ఇతరత్రా ఇస్తున్నామన్నారు.



పుస్తకాల పంపిణీలో సంజయ్ తదితరులు

కార్యక్రమంలో చైర్మన్ రాజేశ్, ఆనంద్, రచేహా, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రూ.70కోట్లతో యాక్షన్‌ప్లాన్

శిడ్లఘట్ట, ఆగస్టు 25: నగరసభ పరిధిలోని అన్ని వార్డులలో ఇంటింటికీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ విధానం అమలు చేసేందుకు రూ.70కోట్లతో యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేశామని అందులో మొదటి విడతగా రూ.38.47 కోట్లు విడుదల చేసినట్టు ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ వెల్లడించారు. పట్టణ శివారులోని చెత్త సంస్కరణ కేంద్రానికి సంబంధించి సమాలోచనలు నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర నీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ మండలి నుంచి రూ.72 కోట్లతో అంచనా పట్టిని కేయూఐడీఎఫ్‌సికి సమర్పించామన్నారు. ప్రస్తుతానికి అమృత 2.0 పథకం కింద రూ.30 కోట్లు, స్వచ్ఛభారత పథకం కింద రూ.8.47 కోట్లు మొత్తం రూ.38.47 కోట్లు కేయూఐడీఎఫ్‌సీ సభలో ఆమోదం లభించిందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్టు తెలిపారు. నగరసభ కమిషనర్ మంజునాథ్, అర్బన్ డెవలప్‌మెంట్ సెక్రటేరియట్ డైరెక్టర్, నగర నీటి సరఫరా, డ్రైనేజీ పథకం అధికారులు, సాంకేతిక విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నమూనాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ



ప్రజల సమస్యలు ఆలకిస్తున్న పోలీసు అధికారులు

మహదేవపుర, ఆగస్టు 25: ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమని వైట్‌ఫీల్డ్ డీసీపీ శివకుమార్ అభిప్రాయపడ్డారు. ఒకవేళ ఎవరైనా అనుకోకుండా సైబర్ నేరాలకు గురైతే వెంటనే కేంద్రప్రభుత్వ పోర్టల్ 1930కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే పోగొట్టుకున్న నగదు పొందే అవకాశం ఉందన్నారు. వైట్‌ఫీల్డ్ విభాగం మహదేవపుర పోలీస్ స్టేషన్ పరిధిలోని హూడి గ్రామ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గౌరి - గణేశ పండుగ శాంతి సభలో పాల్గొని మాట్లాడారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడడమే పోలీసుశాఖ ప్రధాన ధ్యేయమన్నారు. వైట్‌ఫీల్డ్ పరిధిలో 8 పోలీస్ స్టేషన్‌లు ఉండగా ప్రతిస్టేషన్‌లో నిత్యం ఒకటో రెండో బైక్ చోరీ కేసులు నమోదవుతున్నాయన్నారు. ఇటీవలి కాలంలో అనవసరమైన మెసేజ్‌లకు వచ్చే లింక్‌లు ఓపెన్ చేయరాదన్నారు. కాగా వాహనాలపై అనవసరమైన స్టిక్కర్‌లు తొలగించాలని కోరారు. సాధ్యమైన మేరకు జీపీఎస్ విధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ రీనా సువర్ణ, రమేశ్, సీఐలు ప్రవీణ్‌బాబు, అనితా, బీబీఎంపీ, బెస్కాం, జలమండలి అధికారులు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

విజయనగర్‌లో వినూత్నంగా పాలికె బజార్

బెంగళూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దక్షిణాదిన తొలి ఏసీ అండర్‌గ్రౌండ్ శ్రీకృష్ణ దేవరాయ పాలికె బజార్‌ను సీఎం సిద్దరామయ్య ప్రారంభించారు. విజయనగరలో ఆదివారం సాయంత్రం ఏర్పాటైన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం కృష్ణప్ప, గోవిందరాజనగర్ ఎమ్మెల్యే ప్రియకృష్ణలు పాల్గొని శ్రీకృష్ణదేవరాయ విగ్రహాన్ని ఆవిష్కరించారు. స్థానిక కాంగ్రెస్ యువ నాయకుడు ప్రదీప్‌కృష్ణ మాట్లాడుతూ సామాన్యులకు మరింత అందుబాటులో తాజీ కూరగాయలు పండ్లు ఇక్కడ లభిస్తాయన్నారు. స్థానిక ప్రముఖులు పెద్దసంఖ్యలోపాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయ పాలికె బజార్‌ను ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య

బసవేశ్వర జాతరలో మహిళల రొట్టె సేవ

బెంగళూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బిజాపూర్ జిల్లాలోని బసవనబాగేవాడి పట్టణంలో బసవేశ్వర జాతరలను పురస్కరించుకుని అన్నదాసోహంలో భాగంగా ఇళ్లలో సిద్ధం చేసిన రొట్టె బుట్టలను మహిళలు ఊరేగింపుగా ఆలయానికి తరలారు. స్థానిక వీరక్త మఠంలోని బసవణ్ణ చిత్రపటానికి, రొట్టెల బుట్టలకు సిద్దలింగస్వామిజీ పూజలు చేసి ఊరేగింపు ప్రారంభించారు. శనివారం సాగిన ఊరేగింపు స్థానికులను ఆకట్టుకుంది. సుమారు 5వేలకుపైగా రొట్టెలతో పాటు తాళికోటె తాలూకా హగరగుండ ఎల్‌టి సురేశ్ రాథోడ్ ట్రాక్టర్‌లో సుమారు 2వేల రొట్టెలతో అన్నదాసోహ భవనానికి తరలారు. బసవేశ్వరస్వామి సేవా సమితి అధ్యక్షుడు ఈరణ్ణ పట్టణశెట్టి, బసవేశ్వర జాతర సమితి అధ్యక్షుడు గురలింగ బసరకోడ తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా సాగుతున్న మహిళల బృందం

హెంజేరు సిద్దేశ్వరస్వామికి విశేష పూజలు



అలంకరణలో సిద్దేశ్వరస్వామి

మడకశిర(అమరాపురం), ఆగస్టు 25 : మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్దేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. శ్రావణ మాస మూడో ఆదివారం పురస్కరించుకుని ఉదయాన్నే అర్చకులు శివకుమార్‌స్వామి, సిద్దలింగేశ్వరస్వామి, రవి స్వామి, గౌతమ్, ప్రదీప్ స్వామిక రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. వెండికవచంతో అలంకరించి, పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిట కిట లాడింది. ఈ ప్రాంతం వాసులే కాకుండా సమీప కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి అధికంగా భక్తులు తరలివచ్చారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్‌లో శ్రీనివాస కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో అర్చకబృందం

బొమ్మనహళ్ళి, ఆగస్టు 25: శ్రావణమాసం మూడో శనివారం పురస్కరించుకుని హెచ్‌ఎస్ఆర్ లే అవుట్‌లోని వాజ్‌పేయ్ క్రీడా మైదానంలో శ్రీనివాస కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాల్లో భక్తి పాటలు, శనివారం సాయంత్రం మూడు గంటలపాటు తిరుమల శ్రీవారికి నిర్వహించే తరహాలో కల్యాణోత్సవం సాగింది. 9మంది రుత్విక్కులు నేతృత్వం వహించారు. 12ఏళ్లుగా శ్రావణమాసంలో ఏటా కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు. చుట్టుపక్కల ప్రాంతాలనుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ కే వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు శ్రీవారి ప్రసాదం లడ్డూతోపాటు అన్నదానం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి, ఉగ్రప్ప, హెచ్‌ఎస్‌ఆర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీలకు దొడ్డిదారి టీం...!

- జడ్పీలో చక్కబెడుతున్న ప్రత్యేక బృందం
- ఉన్నతాధికారులపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- పాగాకు పావులు కదుపుతున్న అధికారులు

అనంతపురం విద్య, ఆగస్టు 25 : ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్పీ పరిధిలో బదిలీల వేళ అనధికారికంగా ఓ బృందాన్ని రంగంలోకి దించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. జడ్పీలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లు ఉన్నా...ఇతర మండలాల నుంచి ప్రత్యేకంగా వారిని దించినట్లు సమాచారం. ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకుండా కొందరిని సీట్లలో కూర్చోబెట్టి...బదిలీల వ్యవహారాలను చక్కబెట్టాలని నోటి మాటగా ఉన్నతాధికారులు సూచించినట్లు తెలుస్తోంది. జడ్పీ కార్యాలయంలో ఉన్న వారిని కాదని బయటి వ్యక్తులను తీసుకురావడం వెనుక...వ్యాపారం కోసమేనంటూ...ఉద్యోగులు, సిబ్బంది గుసగుసలాడుతున్నారు. ఉత్తర్వులు లేకుండా ఈ టీం ఎందుకంటూ...మండిపడుతున్నారు.

446 దరఖాస్తులు

ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి సాధారణ బదిలీలకు ఉద్యోగుల నుంచి 446 దరఖాస్తులు వచ్చాయి. వీరిలో ఒకే స్టేషన్‌లో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు 286 మంది ఉన్నారు. ఇందులో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు 15 మంది కాగా, సీనియర్ అసిస్టెంట్లు 25 మంది, జూనియర్ అసిస్టెంట్లు 43 మంది, టైపిస్టులు 18 మంది, డ్రైవర్లు ఇద్దరు, రికార్డు అసిస్టెంట్లు 70 మంది, ల్యాబ్ అసిస్టెంట్లు 20 మంది లైబ్రరీ అసిస్టెంట్ ఒకరు, ఆఫీస్ సబార్డినేట్స్ 89 మంది, నైట్ వాచ్‌మెన్స్ ముగ్గురు ఉన్నారు. ఐదేళ్ల పూర్తయిన వారు 286 మంది ఉండగా..... వీళ్లలో ఇప్పటి వరకూ కేవలం బదిలీలకు 231 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. రిక్వెస్టు బదిలీలకు 215 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు.



పాగాకు..పావులు

ఉమ్మడి జిల్లా కేంద్రమైన జడ్పీ కార్యాలయంలో పాగా వేసేందుకు కొందరు అధికారులు పావులు కదుపుతున్నట్లు సమాచారం. సుమారు 15 ఏళ్ల రాప్తాడు, అనంతపురం ఎంపీడీఓ కార్యాలయాల్లో పనిచేసిన ఓ మహిళా అధికారి మళ్లీ జడ్పీలో పాగా వేయాలని చూస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా గతంలో లక్షలాది రూపాయలు ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం చేసి జైలుకు వెళ్లిన మరో అధికారి సైతం ఇక్కడికి వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా ఎవరిస్థాయిలో వాళ్లు పైరవీలు మొదలు పెట్టారు. మరికొందరు ఎంపీలు, ఎమ్మెల్యేల లెటర్లతో జడ్పీకి క్యూ కడుతున్నారు. దీంతో సామాన్య ఉద్యోగులు తమ అవకాశాలను తన్నుకుపోతారోనంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్లోబల్ సమ్మిట్‌కు ఎట్రియా సహకారం

బెంగళూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సుస్థిరమైన పారిశ్రామిక విధానం కొనసాగించడం, జాతీయ, అంతర్జాతీయ స్థాయి, పారిశ్రామిక దిగ్గజాలను పెట్టుబడుల కోసం ఆహ్వానించేందుకై డిసెంబరులో జరిగే గ్లోబల్ సమ్మిట్‌కు ఎట్రియా స్కూల్ ఆఫ్ సుస్టైనబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మద్దతు ఇస్తోంది. ఈమేరకు టై బెంగళూరు చైర్మన్ మదన్ పడకి, ఎట్రియా యూనివర్సిటీ వీసీ రాజీవన్ మాధవన్ నాయర్‌లు ఒప్పందం చేసుకున్నారు. ఎట్రియా స్కూల్ ఆఫ్ సుస్టైనబుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రత్యేక సర్టిఫికెట్ కోర్సులను అందచేస్తోంది. డిగ్రీ స్థాయిలో పారిశ్రామిక సుస్థిరత వంటి కోర్సులు ఉన్నాయి. ఈమేరకు నగరంలో ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్క్‌షాప్‌లు, సర్టిఫికేషన్ కోర్సులు, డిప్లమో కోర్సులను కొనసాగిస్తున్నట్టు తెలిపారు. టై సంస్థ లాభాపేక్ష లేని ఒక సంస్థ. మాధవన్ నాయర్ మాట్లాడుతూ ఆర్థిక అవకాశాల ప్రగతిలో ప్రాథమిక మార్పును చేస్తున్నామని, వాతావరణ మార్పు జీవవైవిధ్యం వంటి అంతర్జాతీయ సమస్యల పరిష్కారమే కాదు అవి ఆవిష్కరణలు కూడా అన్నారు. టైతో ఒప్పందం ద్వారా కొత్త అంశాలతో తమ ప్రయాణం కొనసాగిస్తామన్నారు.

నాణ్యతకు లెనిన్‌క్లబ్ ప్రాధాన్యం

బెంగళూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆదిత్య బిర్లా గ్రూప్ వ్యాపార రంగంలో విశ్వసనీయతకు ప్రాధాన్యత ఇస్తుందని అందుకు అనుబంధమైన లెనిన్‌క్లబ్ నాణ్యత పాటిస్తోందని సీఈఓ సత్యకి ఘోష్ అభిప్రాయపడ్డారు. కోరమంగలలో 17వ లెనిన్‌క్లబ్‌శాఖను లాంఛనంగా ఆరంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగళూరు అంటే దేశ విదేశీయులు ఇష్టపడే ప్రాంతమన్నారు. అందుకే అన్ని ప్రాంతాల్లోనూ లెనిన్‌క్లబ్ అందుబాటులో ఉండాలని, 17వశాఖను తెరిచామన్నారు. దేశవ్యాప్తంగా 231శాఖలకు విస్తరించామన్నారు. ఫ్యాషన్ అండ్ డిజైన్స్‌లో అంతర్జాతీయ బ్రాండ్లకు అనుగుణంగా ఉంటాయన్నారు. 3వేలకుపైగా మోడల్స్ మా ప్రత్యేకత అన్నారు.

జాలీరైడ్‌లో ప్రేమికుల రొమాన్స్

» వీడియోలు వైరల్



వైరల్ అయిన ఫొటో ఇదే...

బెంగళూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రతోపాటు వివిధ ప్రాంతాల్లో యువతీ యువకులు బైక్‌పైనే రొమాన్స్ చేస్తున్న వీడియోలు సర్వత్రా విమర్శలకు కారణమైంది. అటువంటి సంఘటనే బెంగళూరులోనూ శనివారం చోటు చేసుకుంది. యలహంక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రియురాలిని ట్యాంకర్‌పై కూర్చోబెట్టుకుని కౌగిలించుకుని ద్విచక్ర వాహనాన్ని నడిపిన యువకుడికి సంబంధించిన వీడియోలు వైరల్ అయ్యాయి. దేవనహళ్ళి ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రముఖ విద్యాసంస్థలు ఉండే రోడ్డువైపు ద్విచక్ర వాహనం వెళ్లింది. వెనుకవైపునుంచి కారులో వెళ్తున్న వ్యక్తి వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. ప్రేమ, అభిమానం మంచిదేగానీ రోడ్డుపై అతిగా ప్రవర్తించడం సరికాదని నెటిజన్‌లు కామెంట్‌లు చేశారు. ఈ మేరకు పోలీసులు సదరు వాహనం కోసం గాలింపులు జరుపుతున్నారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

బంగారపేట, ఆగస్టు 25: తాలూకాలోని కామసముద్ర మెయిన్‌రోడ్డుపై దిన్నెకొత్తూరు గ్రామం భారత్ గ్యాస్ సంస్థ సమీపాన ద్విచక్రవాహనం, గూడ్స్ వాహనం ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మాలూరు తాలూకా నీడమాకనహళ్ళి నివాసి వీ నాగ రాజ్ (49) మృతి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కాగా ప్రమాదం చేసిన గూడ్స్ వాహన డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. సమాచారం అందుకున్న బంగారపేట పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నట్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నంజప్ప వెల్లడించారు.

మిలటరీ స్కూల్స్ ప్రవేశపరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 25: జాతీయస్థాయిలో 2025-26 విద్యాసంవత్సరానికి రాష్ట్రీయ మిలటరీస్కూల్స్‌లో 6, 9 తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీ పరీక్షల ఉచిత సమాచారకేంద్రం అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఈపరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు వయసు ఆధారంగా 5 నుంచి 9 తరగతులు చదివే బాల, బాలికలకు అవకాశం ఉందని, వచ్చేనెల 19వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. ప్రవేశపరీక్షా విధానం, దరఖాస్తు వంటి ఇతర వివరాలకోసం తిరుపతిలో వరదరాజనగర్‌లోని విశ్వంస్కూల్‌లోగానీ లేదా 86888 88802/ 93999 76999 ఫోన్ నెంబర్లని సంప్రదించాలని కోరారు.